క్లుప్తంగా

ఆత్మకూరు క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా

ఆత్మకూరు: జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ఆత్మకూరు కేవీకే స్టేడియం క్రీడాకారులు ప్రతిభ కనబరిచినట్లు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా తెలిపారు. మంగళవారం ఆయన విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా మున్నా మాట్లాడుతూ ఖోఖో జట్టు విన్నర్ గానూ, వాలీబాల్ జట్టు రన్నర్ గానూ నిలిచాయన్నారు. విజేతలకు ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతులమీదుగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీనియర్ క్రీడాకారులు ఆసీఫ్‌బేగ్, జాబితుల్లా, కలామ్, అన్సర్, ఇజాజుల్, నవీద్, మహబూబ్ పాల్గొన్నారు.

సారూ.. దారి చూపండి



వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నందికొట్కూరు: తమ భూములకు వెళ్లకుండా రైతు జంబులయ్య అడ్డుపడుతున్నాడని, విచారించి చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని వడ్డేమాన్ గ్రామానికి చెందిన రైతులు కుమార్, పాములేటి, నాగన్న మంగళవారం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. అల్లూరు గ్రామ పొలిమేరలో 354/ఎలో 2017లో సర్వే చేసి రస్తా చూపించి, 2019లో ఉపాధి హామీ పథకం కింద తమ భూములకు ప్రభుత్వం రహదారి వేసిందని, అయితే రైతు జంబులయ్య రహదారిని తొలగించి అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. వీరి వెంట మాజీ ఎంపీటీసీ శేఖర్ పాల్గొన్నారు.

మీటర్ రీడర్లను ఆదుకోవాలి



యూనియన్ నాయకులతో చర్చిస్తున్న మీటర్ రీడర్లు

శ్రీశైలంప్రాజెక్ట్: రాష్ట్రంలో విద్యుత్ సంస్థలలో పని చేస్తున్న మీటర్ రీడర్లను ప్రభుత్వం ఆదుకోవాలని హెచ్-64 యూనియన్ ప్రధాన కార్యదర్శి టి.వెంకట్ డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షులు కె.నాగిరెడ్డి అధ్యక్షతన సున్నిపెంటలోని స్వామిరెడ్డి భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మీటర్ రీడర్స్‌పై పనిభారం ఎక్కువైందని, చేయించుకుంటున్న పనికి ఇస్తున్న వేతనానికి వ్యత్యాసముందన్నారు. పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

ఆకుకూరలతో కంటి చూపు మెరుగు



విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: తినే ఆహారంలో ఆకుకూరలు ఉంటే కంటి చూపు మెరుగవుతుందని ఆత్మకూరు కంటి వైద్యాధికారి షేక్షావలి అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం కొత్తపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 18 మంది విద్యార్థిలకు సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి ఉచితంగా అద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తపల్లి వైద్యాధికారి మహమ్మద్ బేగ్, సీహెచ్‌ఓ బాలకృష్ణ పాల్గొన్నారు.

డ్రిప్, స్ప్రింక్లర్లకు దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని బానుముక్కల ఎంపీఈఓ ముర్తుజావలి, బానకచర్ల వీఏఏ ఇలియాస్ తెలిపారు. మంగళవారం వారు ఆయా గ్రామాల్లోని రైతులు సాగుచేసిన మిరప, పండ్ల తోటలను ఈ పంట నమోదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యానవన పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవటం ద్వారా రాయితీపై పరికరాలు పొందవచ్చని తెలిపారు.

ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలి



మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య తలుచుకుంటేనే భయమేస్తోంది. మహిళల పట్ల చులకన భావం పోవాలి. మహిళలను గౌరవించడం చిన్నప్పటి నుంచే మగ పిల్లలకు తల్లిదండ్రులు నేర్పాలి. ఏది ఏమైనా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరిస్తే తప్ప మృగాళ్లలో మార్పు రాదు. – నాగలక్ష్మి, వైద్యాధికారులు, పాములపాడు



భద్రత పెంచాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, హత్య ఘటన అనంతరం బయటకు రావాలంటే భయమేస్తోంది. మహిళా వైద్యులకు, ఉద్యోగులకు భద్రత కల్పించాలి. మేము ఒకరిని బతికించడానికి పని చేస్తాం. పనిచేసే చోటే భద్రత లేకపోవడం బాధాకరం. కోల్‌కతా ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ఆసుపత్రుల్లో రాత్రి వేళల్లో విధులు నిర్వహించే సిబ్బందికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన రక్షణ కల్పించాలి. – రామతులసి, స్టాఫ్ నర్సు, సీహెచ్‌సీ, మిడుతూరు

చంద్రన్న మాటలన్నీ 'గ్యాస్'

- మరో హామీకి మంగళం పాడినట్లేనా ..
- ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటున్న మహిళలు



గ్యాస్ పొయ్యిపై వంట చేస్తున్న మహిళలు

జూపాడుబంగ్లా: చంద్రబాబునాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో సూపర్‌సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టి మహిళలను మభ్యపెట్టి వారి ఓట్లు కొల్లగొట్టాడు. సీఎం అయ్యాక మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ఊసెత్తకపోవటంతో మహిళలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సూపర్‌సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తామని పేర్కొన్న చంద్రబాబు నాయుడు.. అధికారం చేపట్టి రెండు నెలలు గడిచిపోయినా ఆ ఊసెత్తకపోవటంతో మహిళలు తప్పుబడుతున్నారు. ఎన్నికల మేనిఫెస్టో అమలు గురించి కూటమి నేతలు ఒక్కరంటే ఒక్కరూ నోరు మెదపకపోవటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో 85,375 కుటుంబాలు

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పాములపాడు, కొత్తపల్లి, మిడ్తూరు, పగిడ్యాల మండలాల్లో 85,375 కుటుంబాలుండగా 94,550 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. నందికొట్కూరు నియోజకవర్గం వ్యాప్తంగా 1,11,340 మంది మహిళా ఓటర్లు ఉండగా వారి ఓట్లను రాబట్టుకునేందుకు ఎన్నికల సమయంలో తనను గెలిపిస్తే ఏడాదికి ఉచితంగా మూడు గ్యాసు సిలిండర్లు ఇస్తానని పేర్కొన్నాడు. కూటమి ప్రభుత్వం గెలుపొందాకా సీఎం చంద్రబాబునాయుడు, కూటమినేతలెవ్వరూ ఉచిత గ్యాసు సిలిండర్ల సరఫరా విషయమై ఊసెత్తకపోవటంతో మహిళలు చంద్రబాబు చెప్పేమాటలన్నీ బూటకపు మాటలేనా అని విమర్శిస్తున్నారు. ప్రస్తుతం గ్యాసు సిలిండర్ ధర రూ.853 ఉండగా నలుగురు కుటుంబ సభ్యులున్న ఇంట్లో ఓ గ్యాసు సిలిండర్ నెలరోజులు మాత్రమే వస్తుందని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఈ లెక్కన ఏడాదికి 10 నుంచి 12 సిలిండర్లు వెచ్చించాల్సి వస్తుందంటున్నారు. ఒకరు, ఇద్దరు ఉన్న కుటుంబాల్లోనైతే ఓ సిలిండర్ మూడు నెలల పాటు వస్తుందంటున్నారు. ఈ లెక్కన చంద్రబాబు ఇస్తానన్న మూడు ఉచిత గ్యాసు సిలిండర్లు ఏడాది పొడవునా తమకు గ్యాసు కొనుగోలు భారం తగ్గుతుందని పేర్కొంటున్నారు. అయితే ఓట్లు వేయించుకొని ఇస్తామన్న పథకాలు ఇవ్వకపోతే చంద్రబాబు మరోసారి ఎవ్వరు నమ్ముతారని పేర్కొంటున్నారు.

రూ.21.84 కోట్లు అవసరం

నియోజకవర్గం వ్యాప్తంగా 85,375 కుటుంబాలుండగా ఒక్కో కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాసు సిలిండర్ల చొప్పున ఇస్తే అందరికీ 2,56,125 గ్యాసుసిలిండర్లు ఇవ్వాల్సి ఉంటుంది. అందుకుగాను ఓ సిలిండర్‌కు రూ.853ల చొప్పున వెచ్చిస్తే రూ.21,84,74,625ల చొప్పున ఓ నియోజకవర్గానికి నిధులు కేటాయించాల్సి ఉంటుంది.

నియోజకవర్గంలోని కుటుంబాలు, గ్యాస్ కనెక్షన్ల వివరాలు

మండలం పేరు	కుటుంబాల సంఖ్య	గ్యాస్‌కనెక్షన్లు
జూపాడుబంగ్లా	11,929	6,114
నందికొట్కూరు	25,606	25,886
పాములపాడు	13,453	20,375
కొత్తపల్లి	10,027	19,500
మిడుతూరు	13,494	8,175
పగిడ్యాల	10,866	14,500
మొత్తం	85,375	94,550

ఓట్లేసి మోసపోయాం



చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు ఇస్తామని చెప్పినందుకే పొలం పనులకు వెళ్లినప్పుడు అక్కడ మహిళలంతా మాట్లాడుకొని ఆయనకు ఓట్లు వేశాం. మేం వేసిన ఓట్లతో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు కాబట్టి ఉచితంగా మూడు గ్యాసు సిలిండర్లు ఇవ్వాలి. నేను ఒంటరి మహిళను. నాకు ఓ సిలిండర్ మూడు నెలలు వస్తుంది. చంద్రబాబు ఉచితంగా గ్యాసు సిలిండర్లు ఇస్తే నేను ఏడాది పొడవునా గ్యాసు కొనాల్సిన అవసరం ఉండదు.

– మంగమ్మ, తాటిపాడు

చంద్రబాబును ఎవ్వరూ నమ్మరు



చంద్రబాబు ఎన్నికల ప్పుడు తనను గెలిపిస్తే ఉచితంగా ఇస్తామన్న గ్యాసుసిలిండర్లు వెంటనే ఇవ్వాలి. ఇప్పుడు ప్రతి మహిళ గ్యాసు పొయ్యి మీదే వంట చేస్తున్నారు. గ్యాసు కొనలేక ఇబ్బందులు పడుతున్నాం. చంద్రబాబు ఇస్తామన్న మూడు ఉచిత గ్యాసు సిలిండర్లు ఇచ్చే పథకాన్ని వెంటనే ప్రారంభించాలి. ఒక వేళ చంద్రబాబు మాట తప్పితే ఆయనను ఎవ్వరూ నమ్మరు.

– మరియమ్మ, గువ్వలకుంట్ల

ఉచిత గ్యాసు సిలిండర్లు ఇవ్వాలి



ఎన్నికల సమయంలో చంద్రబాబు మహిళల ఓట్ల కోసం ఉచిత ప్రయాణం, ఉచితంగా ఏడాదికి మూడు గ్యాసు సిలిండర్లు ఇస్తామని చెప్పాడు. ఆయన మాటలు నమ్మి ఓట్లు వేశాం. ఇప్పుడు చంద్రబాబు చెప్పినట్లుగా వెంటనే ఉచిత గ్యాసు సిలిండర్ల పథకం వెంటనే ప్రారంభించి మహిళలను ఆదుకోవాలి. లేకపోతే ఇకపై ఆయన మాటలను మహిళలు ఎవ్వరూ నమ్మేపరిస్థితి ఉండదు. – నాగమణిబాయి, బానుముక్కల

కోరం లేకున్నా ఎస్ఎంసీ ఎన్నిక పూర్తి

పగిడ్యాల: ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడుతూ వస్తున్న స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ ఎన్నిక మంగళవారం కోరం లేకున్నా అధికారులు శుభం కార్డు వేశారు. హెచ్ఎం మధుసూదన్‌రావు, ఎన్నికల అబ్జర్వర్, ఎంఈఓ సుభాన్ హాజరైనా విద్యార్థుల తల్లిదండ్రులు గైర్హాజరయ్యారు. రోజుకు రూ.600 కూలీ వదిలి ఇప్పటికే మూడుసార్లు ఓటింగ్‌కు హాజరయ్యామని, ఇక తమ వల్ల కాదని ఫోన్‌లో ఉపాధ్యాయులకు తెగేసి చెప్పినట్లు సమాచారం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే వర్గీయులు కోరం లేకపోతేనేం.. ఏమీ కాకుండా తాము చూసుకుంటామని, తాము సూచించిన అభ్యర్థులను చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ప్రకటించాలని ఒత్తిడి చేశారు. తర్జనభర్జనల అనంతరం చైర్మన్ పదవి ఎంపీ వర్గానికి, వైస్ చైర్మన్ పదవి ఎమ్మెల్యే వర్గానికి ఇచ్చేలా బేరం కుదుర్చుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఆ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే వర్గీయులు సూచించిన అంకిరాపల్లె నాగరత్నం, షేక్ అక్సామహిక్‌లను చైర్మన్, వైస్ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

శ్రీశైలంప్రాజెక్ట్: పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సున్నిపెంట సీనియర్ ఎంటమాలజిస్ట్, శానిటేరియన్ అధికారులు విజయకుమార్, రవి ప్రకాష్, బాలనరసయ్య ప్రజలకు సూచించారు. జాతీయ కీటక నివారణ చర్యల్లో భాగంగా మంగళవారం పలు పాఠశాలల్లో దోమల మందును తమ సిబ్బందితో పిచికారీ చేయించారు. దోమల వ్యాప్తితో మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలుతాయని, దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, నీల్లను తొట్లలో రోజుల తరబడి నిల్వ చేయొద్దని సూచించారు.

నేడు మండల మీట్

వెలుగోడు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వే సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ అమానుల్లా తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ మాట్లాడుతూ ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

నందనవనంలా తీర్చిదిద్దుతాం

- గ్రేడ్ పెరగడంతో వాటర్ ట్యాక్స్ పెంచక తప్పదు
- విడతల వారీగా చెల్లించేందుకు నడలింపు
- మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియామారూఫ్

ఆత్మకూరు: విద్యుత్ స్తంభాలు, లైట్లు, సీసీ రోడ్లు, పారిశుధ్య చర్యలు చేపట్టి ఆత్మకూరును నందనవనంలా తీర్చిదిద్దుతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారూఫ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం సభ్యులు పలు సమస్యలు లేవనెత్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గతంలో మున్సిపాలిటీ త్రీ గ్రేడ్‌లో ఉండేదని, 2 గ్రేడ్‌గా మార్పు జరిగడంతో కొన్ని పన్నులను పెంచాల్సి వస్తుందన్నారు. గతంలో ఏడాదికి రూ.600 చొప్పున వాటర్ ట్యాక్స్ ఉండేదని, ప్రస్తుతం దానిని రూ.960 పెంచి, నెలకు రూ.80 చొప్పున చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కో ఆప్షన్ సభ్యులు శకునాల తిరుపతయ్య చేసిన రాజీనామాను తిరస్కరిస్తున్నట్లు తెలిపారు. అన్నా క్యాంటీన్లకు ప్రభుత్వం రూ.7.50 లక్షలు మంజూరు చేసిందని, మరమ్మతులకు రూ.5.50 లక్షలు ఖర్చు చేశామని, ఇంకా కొన్ని పనులు జరగాల్సి ఉందన్నారు. బ్లీచింగ్ ఫౌడర్ కొనుగోలుకు రూ.99 వేలు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలకు రూ.5 లక్షలు, వడ్ల రామాపురంలోని బావిలో ఇనుప గ్రిల్ ఏర్పాటుకు రూ.5 లక్షలు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు సభ్యులు ఆమోదించాలని కోరారు. ఆత్మకూరు మున్సిపాలిటీలో నూతన భవనం నిర్మాణానికి రూ.3 కోట్లు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం తీర్మానాలను సభ్యులు ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు ఎం.ఎ.రషీద్, మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆసియామారూఫ్

శనగల బసవన్నకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడు వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు.



శనగల బసవన్నకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సమస్యలపై ఐక్యంగా పోరాడదాం



ఏకగ్రీవంగా ఎన్నికైన వారిని సన్మానిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

ఆత్మకూరు: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై ఐక్యంగా పోరాడదామని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తాలూకా నూతన జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్, ప్రెసిడెంట్ ఇల్లూరి బాలకృష్ణయ్య అన్నారు మంగళవారం మాజీ జనరల్ సెక్రటరీ చాంద్‌బాషా ఆధ్వర్యంలో కమిటీ సమావేశమై నూతన జనరల్ సెక్రటరీ, ప్రెసిడెంట్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమావేశంలో సంఘం నాయకులు కల్లూరి పెద్ద మస్తానయ్య, శ్రీనివాసులు, సుదర్శనం, గుర్రప్ప, రమణ, వెంకటరమణగౌడ్, ధనలక్ష్మి, రసూల్, పద్మావతి, జనార్ధన్, దస్తగిరి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు సురక్షితం

ఆత్మకూరు: ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు అయితే తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి గోపాల్ సూచించారు. బైర్లూటీ పరిధిలోని సంజీవనగర్ తండాలో మంగళవారం 104 వాహన వైద్య సేవలు అందించారు. పలువురికి వైద్య చికిత్సలు చేశారు. రక్తపోటు వ్యాధిగ్రస్తులను, గర్భిణులకు మందులను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవించాలని గర్భిణులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ దీపికాబాయి, ఆరోగ్య కార్యకర్తలు విశ్వనాథ్, భాస్కర్, బేబిజ్యోతి పాల్గొన్నారు.



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ గోపాల్

మండపాల రక్షణ బాధ్యత నిర్వాహకులదే



గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశమైన సీఐ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే గణేష్ మండపాల రక్షణ బాధ్యత నిర్వాహకలదేనని సీఐ ప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం విభూదిమఠంలో గణేష్ మండపాల నిర్వాహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రక్షణ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. నిమజ్జన తేదీని, శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పోలీస్ స్టేషన్‌కు అందజేయాలన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లను వినియోగించరాదన్నారు. వలంటీర్లను నియమించుకుని, వారికి బ్యాడ్జీలు ఇవ్వాలని సూచించారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలి

కొత్తపల్లి: వీరాపురం గ్రామంలోని పాత, కొత్త ఎస్సీ కాలనీలలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ నాయకులు వర్ధన్, జాన్సన్‌బాబు మంగళవారం గువ్వలకుంట్ల సచివాలయ పంచాయతీ కార్యదర్శి-2 నాగర్జునకు వినతి పత్రం అందించారు.

వీబీఆర్‌లో నిలకడగా నీటి మట్టం

వెలుగోడు: తెలుగు గంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నీటి మట్టం నిలకడగా ఉంది. వీబీఆర్ పూర్తిస్థాయి నీటి మట్టం 16.95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 14.731 టీఎంసీలు నిల్వ ఉంది. బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వీబీఆర్‌లోకి 10,700 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. అలాగే వీబీఆర్ నుంచి మద్రాసు కాలువకు 5,000, స్పిల్ వే ద్వారా గాలేరుకు 5,000 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 50 క్యూసెక్కులు, వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 15 క్యూసెక్కులు నీటి విడుదల చేస్తున్నటుల తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

కొత్తపల్లి: వసతి గృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ మేరి సూచించారు. మంగళవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ఆమె తనిఖీ చేశారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న, వసతిగృహ వార్డెన్ షబ్బీర్, వీఆర్వో చంద్రశేఖర్ ఉన్నారు.

వేతనాలు మంజూరు చేయాలి

కొత్తపల్లి: స్వచ్ఛభారత్ కార్మికుల పెండింగ్ వేతనాలు మంజూరు చేయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.స్వాములు, ఏపీ స్వచ్ఛభారత్ గ్రామీణ పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు స్వాములు, హనుమంతు మంగళవారం ఎంపీడీఓ మేరిని కలిసి వినతి పత్రం అందించారు.

క్రీడా వేడుకలు ప్రతిపాఠశాలలో జరపాలి

ఆత్మకూరు: ఈనెల 29న హాకీ క్రీడా మాంత్రికుడు జయంతిని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని పీఈటీ పుల్లయ్య కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడలు నిర్వహించాలన్నారు. వేడుకల్లో ధ్యాన్‌ఛంద్ గురించి ప్రతి విద్యార్థికి తెలియజేయాలన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేయండి

- ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ

మిడుతూరు: పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులను, అధికారులను ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ సూచించారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ముందుగా అధికారులు తమ ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ

సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ జీఎస్ఎస్ రెడ్డి, పశువైద్యాధికారి డాక్టర్ చంద్రమోహన్, ఎంఈఓ శ్రీనాథ్, వైస్ ఎంపీపీ నబీరసూల్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణంలోని హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన తనను అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త, వదినలు, మరిది వేధింపులకు గురిచేస్తున్నారని బాధితురాలు మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. వివరాలు.. హనుమాన్‌నగర్ కాలనీకి చెందిన పరశురాముడు కుమార్తె ఐశ్వర్య (అలియాస్ పల్లవి) ని ఏడాదిన్నర క్రితం నందికొట్కూరుకు చెందిన సంపటి వీరకుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలంగా భర్త వీర కుమార్, అత్త సుంకమ్మ, వదినలు మాధవి, రంగమ్మ, మరిది శివ చంద్ర రూ. 2 లక్షలు, ఒక తులం బంగారు తీసుకురావాలని వేధింపులకు గురి చేస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మాసుం బాషా తెలిపారు.

మల్లన్న సేవలో హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ కమిషనర్

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆంధ్రప్రదేశ్ హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ కమిషనర్ జి.రేఖారాణి (ఐఏఎస్ అధికారిణి) దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంగళవారం రాజగోపురం వద్ద కమిషనర్ దంపతులకు ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు స్వాగతం పలికారు. కమిషనర్ దంపతులు మల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అధికారులు స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూ ప్రసాదాలను అందించి సత్కరించారు.



మల్లన్న దర్శనానికి వెళ్తున్న కమిషనర్

విఘ్నాలను తొలగించేవాడే గణపతి

శ్రీశైలం టెంపుల్: విఘ్నాలను నివారించటానికే గణపతి అవిర్భవించాడని, సమస్త విఘ్నాలను తొలగించేవాడు గణపతియేనని సకల పురాణాలు చెబుతున్నాయని ప్రముఖ ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ గణపతి గాథలు ప్రవచనాలు నాల్గవరోజు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణపతిని నిర్మలమైన హృదయంతో ఆశ్రయించిన వారికి సుప్రసన్నుడవుతాడన్నారు.



ప్రవచనాలను వినిపిస్తున్న ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ

హోరాహోరీగా క్రీడా పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఆగస్టు 29న హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం నంద్యాలలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వాలీబాల్, టెన్నిస్, క్రికెట్ హాకీ, ఖోఖో, త్రోబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. హాకీ చాంపియన్‌షిప్ రాష్ట్ర అధ్యక్షుడు చాణక్యరాజు పోటీలను ప్రారంభించారు. మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీల్లో ఎస్‌డీఆర్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి తెలిపారు. ఎస్పీజీ క్రీడా మైదానంలో జరిగిన హాకీ ఫైనల్ పోటీల్లో ఎస్పీజీ హైస్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. అలాగే హాకీ మహిళల పోటీల్లో సంతజూటూరుకు చెందిన జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు విజయం సాధించారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ క్రీడా మైదానంలో జరిగిన ఖోఖో పోటీల్లో పురుషులు నాలుగు జట్లు, మహిళలు రెండు జట్లు తలపడగా కేశవరెడ్డి స్కూల్ జట్టు విజయం సాధించిందన్నారు. గురురాజ పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన త్రోబాల్ పోటీల్లో గురురాజ విజేతగా నిలవగా త్రోబాల్ మహిళల పోటీల్లో గుడ్ షఫర్డ్ విజయం సాధించిందన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నంద్యాల స్టేడియంలో జరిగిన వాలీబాల్ పురుషుల పోటీల్లో కేశవరెడ్డి విద్యార్థులు విజయం సాధించారు. అలాగే వాలీబాల్ మహిళల పోటీల్లో కేఎస్ఎం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు విజయం సాధించినట్లు ఆయన వివరించారు. విజేతలకు ఈనెల 29వ తేదీన బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు.

చెంచులకు పథకాలు అందజేద్దాం

కొత్తపల్లి: చెంచు గిరిజనులకు ప్రభుత్వ పథకాలు అందించేలా కృషి చేస్తామని ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్ అన్నారు. మంగళవారం ఎదురుపాడు చెంచుగూడెంలో ఎంపీడీఓ మేరీతో కలిసి ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ రాజు నాయక్, టెక్నికల్ అసిస్టెంట్ బషీరున్ పాల్గొన్నారు.



గిరిజనులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ కేజీ నాయక్